రాయపర్తి : తండావాసులకు ప్రజాపాలన పత్రాలు అందజేస్తున్న అధికారులు

గృహజ్యోతి పథకాన్ని వినియోగించుకోవాలి

రాయపర్తి/నర్సంపేట, జూలై 12: గృహజ్యోతి పథకాన్ని అర్హులు వినియోగించుకోవాని జిల్లా టెక్నికల్ డీఈ ఆనందం, వరంగల్ రూరల్ డివిజన్ ఆపరేషన్స్ డీఈ భిక్షపతి కోరారు. శుక్రవారం జయరాంతండా పరిధిలోని జయరాంతండా(ఎస్), శ్రీరాంనగర్‌తండా, సూర్యాతండా, ధర్యాతండా, సుభాష్‌తండా, బాలునాయక్ తండా, గోప్యాతండాలో ఏఈ కె. నిఖిల్‌కుమార్ సారథ్యంలో అధికారుల బృందం క్షేత్రస్థాయిలో పర్యటించింది. ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని సూచించారు. వారి వెంట మైలారం సబ్ డివిజన్ సబ్ ఇంజినీర్ ముజాఫర్ అహ్మద్ అలీ, ఏఎల్ఎంలు దయాకర్, ఊరటి శ్రీకాంత్, అచ్చ సునీల్‌కుమార్, పొన్నం సురేందర్, భూక్యా వెంకన్న, బిల్ల రాజు, సందీప్, అబ్బోజ్ అఖిల్ పాల్గొన్నారు. నర్సంపేట మున్సిపాలిటీ కార్యాలయంలో గృహజ్యోతి విద్యుత్ సవరణలు చేసుకోవాని అధికారి శ్రీధర్ కోరారు. సర్వీస్ నంబర్ ఇచ్చినా, అద్దె ఇల్లు మార్చినా సవరణలకు ఆవకాశం ఉందన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

'ఉన్మాదిని కఠినంగా శిక్షించాలి'

చెన్నారావుపేట, జూలై 12: మండలంలోని 16 చింతలతండాకు చెందిన బానోత్ సుగుణ-శ్రీను దంపతులను హత్య చేసిన ప్రేమోన్మాదిని కఠినంగా శిక్షించాలని బీఆర్ఎస్ నాయకులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బాధిత కుటుంబ సభ్యులను శుక్రవారం వారు పరామర్శించి ధైర్యం చెప్పారు. ఉన్మాది దాడిలో తీవ్రంగా గాయపడిన అక్కా, తమ్ముడిని అక్కున చేర్చుకొని వైద్య సేవలు అందించిన నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డికి గిరిజనుల తరపున ధన్యవాదాలు తెలిపారు. బాధిత కుటుంబానికి అండగా నిలవాల్సిన ప్రభుత్వ పెద్దలు, కాంగ్రెస్ నాయకులు మానవతా దృక్పథం మరిచి మాట్లాడడం బాధాకరమన్నారు. బాధితులు దీపిక, మదన్‌లాల్‌కు ప్రభుత్వం రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి, ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు బద్దూనాయక్, గణేశ్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు భూక్యా సమ్మయ్య, గిరిజన సంఘం బాధ్యుడు నరేశ్‌నాయక్ పాల్గొన్నారు.

'ఎస్సై మృతికి కారకులను తొలగించాలి'

నల్లబెల్లి, జూలై 12: ఎస్సై శ్రీనివాస్ మృతికి కారకులైన పోలీసులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విధుల నుంచి శాశ్వతంగా తొలగించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య డిమాండ్ చేశారు. అశ్వరావుపేట పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ ఇటీవల ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఈ మేరకు వెంకటయ్య నారక్కపేటకు చేరుకొని శ్రీనివాస్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. బాధిత కుటుంబానికి రూ. కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, ఆయన ఇద్దరు పిల్లలను ప్రభుత్వమే చదివించాలని కోరారు. ఆయన వెంట తహసీల్దార్ రాజేశ్, కమిషన్ సభ్యులు రేణిగుంట ప్రవీణ్, రాంబాబు, కొంకటి లక్ష్మీనారాయణ, మాజీ కార్పొరేటర్ జోరిక రమేశ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి, దళిత సంఘాల నాయకులు భట్టు సాంబయ్య, బొట్ల పవన్, నరేశ్, చంద్రమౌళి ఉన్నారు.

గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు

వర్ధన్నపేట/సంగెం, జూలై 12: ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని సంగెం మండలం తోట్ల, వీఆర్ఎన్ తండాలో ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా వర్ధన్నపేటలో సీఐ స్వరూప మాట్లాడుతూ గుడుంబా తయారీని అరికట్టేందుకు గ్రామాలు, తండాల్లో దాడులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం సంగెం మండల పరిధిలోని తండాలు, గ్రామాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించామన్నారు. తోట్ల తండా, వీఆర్ఎన్‌తండాలో గుడుంబా స్థావరాలను గుర్తించామని, డ్రమ్ముల్లో సారా తయారీ కోసం నిల్వ చేసిన సుమారు వెయ్యి లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశామన్నారు. తొట్లతండాకు చెందిన మూడు రవి, మూడు భిక్షపతి, మూడు మధు, వీఆర్ఎన్‌తండాకు చెందిన గుగులోత్ తిరుపతిపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు. దాడుల్లో ఎస్సై సరిత, సిబ్బంది రమేశ్‌బాబు, మానస పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట విద్యార్థి నేతల ధర్నా

ఖిలావరంగల్, జూలై 12: రాష్ట్రంలో ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఏవోకు వినతిపత్రం సమర్పించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చుక్క ప్రశాంత్, యార ప్రశాంత్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వినోద్, మహేశ్, ప్రవీణ్, చందు, ఈశ్వర్, నరేశ్‌స్వామి, సుధీర్, మానస, రక్షిత, నికిత, అఖిల తదితరులు పాల్గొన్నారు.

వేద పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్, జూలై 12 : నగరంలోని భద్రకాళీ దేవస్థానంలో నిర్వహిస్తున్న వేద పాఠశాలలో అడ్మిషన్ల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆలయ ఈవో శేషుభారతి ఒక ప్రకటనలో తెలిపారు. 8 నుంచి 12 ఏళ్లలోపు ఆసక్తి కలిగిన పిల్లలు శనివారం నుంచి 22 వరకు దరఖాస్తులను వేద పాఠశాల కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. మాతృభాషలో చదవడం, రాయగలిగి, ఉపనయన సంస్కారం, ఉపాకర్మోత్సర్జనములు పూర్తి అయిన వారు, సంధ్యావందనం, అగ్నికార్యం, బ్రహ్మయజ్ఞం కంఠస్థం వచ్చిన వారికి మాత్రమే వేద పాఠశాలలో ప్రవేశానికి అర్హులని తెలిపారు.

ఆటోను ఢీకొట్టిన కారు

■ మహిళా కూలీలకు తీవ్రగాయాలు ■ ఇల్లంద శివారులో ఘటన

వర్ధన్నపేట, జూలై 12: కూలీలతో వెళ్తున్న ఆటోను కారు ఢీకొట్టడంతో పలువురు మహిళా కూలీలకు గాయాలైన ఘటన ఇల్లంద శివారులో శుక్రవారం జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. ఇల్లంద కాలనీకి చెందిన పలువురు మహిళా కూలీలు కడారిగూడేనికి కూలి పనుల కోసం ఆటోలో వెళ్తున్నారు. అతివేగంగా వస్తున్న కారు ఢీకొనడంతో ఆటో బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలు కాగా, మరో ఐదుగురు స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను అంబులెన్స్‌లో వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు.

రైలులో నుంచి పడి ఒకరి మృతి

ఖిలావరంగల్, జూలై 12: వేగంగా వెళ్తున్న రైలులో నుంచి పడి ఒకరు మృతి చెందిన ఘటన శుక్రవారం వరంగల్, కాజీపేట రైల్వేస్టేషన్ల మధ్య జరిగింది. వరంగల్ జీఆర్పీ పోలీసుల కథనం ప్రకారం.. సుమారు 35 ఏళ్ల వయస్సు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి హంటర్‌రోడ్డులోని న్యూశాయంపేట రైల్వేగేటు సమీపంలో రైలులో నుంచి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి మాం, ఎడమ చేతిపై వైషు, కుడి చేతిపై గాంధీ అని పచ్చబొట్లు ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపర్చినట్లు పేర్కొన్నారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

- వారిని వ్యాపారంలో ప్రోత్సహించాలి
- డిమాండ్ మేరకు పరిశ్రమలు స్థాపించాలి
- కలెక్టర్ డాక్టర్ సత్య శారదాదేవి

కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ సత్య శారదాదేవి

ఖిలావరంగల్, జూలై 12: ఇందిరా మహిళా శక్తి పథకాన్ని వినియోగించుకొని మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారదాదేవి పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆమె సెర్ప్, స్త్రీనిధి సిబ్బందితో మహిళా శక్తి కార్యక్రమం అమలుపై సమీక్షించారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ఇందిరా మహిళా శక్తి పథకం ముఖ్య ఉద్దేశని కలెక్టర్ అన్నారు. ఈ పథకాన్ని జిల్లాలో దిగ్విజయం చేసేందుకు అధికారులు అంకితభావంతో పని చేయాని సూచించారు. స్వయం సహాయ సంఘాల ద్వారా పలు రకాల సూక్ష్మ పరిశ్రమలు, వ్యాపారాలను ప్రోత్సహించి సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళల ఆర్థిక స్వావలంబనకు సహకరించడం, మహిళల సామాజిక భద్రత కోణంలో సంఘాలను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. మహిళలు వ్యాపారం ప్రారంభించే ముందు తమ వద్ద ఉత్పత్తి అయ్యే వస్తువుల మార్కెటింగ్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. వ్యాపార రుణాలు సకాలంలో చెల్లించాలన్నారు. డిమాండ్ ప్రతిపాదికన పరిశ్రమలు ఏర్పాటు చేస్తే ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. జిల్లాలో 1763 లబ్ధిదారులకు వచ్చే వంద రోజుల్లో పాడి గేదెల పెంపకం, పౌల్ట్రీ, ఫుడ్ ప్రాసెసింగ్, మిల్క్ పార్లర్లు, మొబైల్ ఫిష్ రిటైల్ ఔట్‌లెట్లు, వ్యవసాయ అద్దె పరికరాల కేంద్రం తదితర సెక్టార్లలో జీవనోపాధి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

మహిళల ఆర్థిక స్వావలంబన కోసం..

కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం స్వీకారం చుట్టిందని అదనపు కలెక్టర్ జీ సంధ్యారాణి అన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం పౌల్ట్రీ ఫారాలు, పాడి పశువుల యూనిట్లు, కోళ్ల ఫారాలు, మిల్క్ పార్లర్లు, చేపల విక్రయ కేంద్రాలు, మైక్రో ఎంటర్ప్రైజెస్, స్టిచ్చింగ్ సెంటర్, మీసేవ, ఈవెంట్ మేనేజ్‌మెంట్, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్, కస్టం హైరింగ్ సెంటర్, కామన్ ప్రాసెసింగ్ సెంటర్స్ వంటి 14 రకాల యూనిట్లను స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసుకునేందుకు ప్రోత్సహించాలన్నారు. సమావేశంలో డీఆర్డీవో కౌసల్యాదేవి, జడ్పీ సీఈవో రాంరెడ్డి, లీడ్ బ్యాంక్ మేనేజర్ హవేలీ రాజు, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి బాలకృష్ణ, సంబంధిత శాఖల అధికారులు, పీడీఎం, ఏపీఎం, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన మార్నేని

ఖిలావరంగల్, జూలై 12: వరంగల్ కలెక్టర్ సత్య శారదాదేవిని తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పూల మొక్క అందజేశారు.

మార్కెట్ కార్యదర్శి..

కాశీబుగ్గ : వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి నూతన కార్యదర్శి పోలెపాక నిర్మల గురువారం రాత్రి కలెక్టర్ డాక్టర్ సత్య శారదాదేవిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పండ్ల బుట్టను అందజేశారు. కార్యక్రమంలో డీఎంవో పాలకుర్తి ప్రసాద్‌రావు, అకౌంటెంట్ రాజ్‌కుమార్, అసిస్టెంట్ సెక్రటరీ రాజేందర్ పాల్గొన్నారు. అలాగే, కార్యదర్శి తెలంగాణ రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయిని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

నీట్ పరీక్షను రద్దు చేయాలి

ఖిలావరంగల్, జూలై 12: ఇటీవల పేపర్ లీకైన నీట్ పరీక్షను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూపీ వైఎల్ ఆధ్వర్యంలో కలెక్టర్ సత్య శారదాదేవికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎలకంటి రాజేందర్, గుర్రం అజయ్, రంజిత్, కరుణాకర్, హరిబాబు, వీరన్న, బాలరాజు పాల్గొన్నారు.

దవాఖాన ఎదుట ఆందోళన

నర్సంపేట, జూలై 12: పట్టణంలోని నెక్కొండ రోడ్డులో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతి చెందింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. చంద్రయ్యపల్లెకు చెందిన బాషబోయిన ఓదమ్మ(70) చికిత్స కోసం శుక్రవారం వచ్చింది. బీపీ ఎక్కువై కాళ్లు గుంజుతున్నాయని రావడంతో టెస్టులు చేసి ఆస్పత్రిలో అడ్మిట్ కావాలనడంతో దవాఖానలో చేరింది. ఆమెకు సెలైన్ పెట్టి ఇంజిక్షన్లు ఇచ్చి చికిత్స చేస్తుండగా మృతి చెందింది. వైద్యుడి నిర్లక్ష్యం వల్లే ఓదమ్మ మృతి చెందిందని బంధువులు ఆరోపిస్తూ ఆస్పత్రి ఎదుట ధర్నా చేశారు. పోలీసులు వివరాలు సేకరించారు. ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామన్నారు. తమ నిర్లక్ష్య మేమీ లేదని, వృద్ధురాలికి బీపీ ఎక్కువై మృతి చెందిందని డాక్టర్‌అమృతరెడ్డి తెలిపారు.

ఆరు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వర్ధన్నపేట, జూలై 12: ల్యాబర్తి శివారు ఆకేరువాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను అధికారులు శుక్రవారం సాయంత్రం పట్టుకున్నారు. పక్కా సమాచారంతో తహసీల్దార్ విజయ్‌సాగర్, ఎస్సై ప్రవీణ్‌కుమార్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఆరు ట్రాక్టర్లను స్వాధనం చేసుకున్నారు.

'బీసీ-ఏలో చేర్చాలి'

వర్ధన్నపేట, జూలై 12: రాష్ట్రంలోని ముదిరాజ్ కులస్తులను బీసీ-డీ నుంచి ఏలోకి మార్చాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్‌కుమార్, జిల్లా చీఫ్ ప్రమోటర్ చొప్పరి సోమయ్య డిమాండ్ చేశారు. వర్ధన్నపేటలో శుక్రవారం ముదిరాజ్‌ల మహాసభ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ నెల 15న రాష్ట్రవ్యాప్తంగా తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో సంఘం నాయకులు పొన్నం మొగిలి, నీరటి సదానందం, కోటి, కాశీనాథం, నర్సయ్య, రాకేశ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ఖానాపురం, జూలై 12: మండలంలోని ఖానాపురం, మంగళవారిపేట, అశోక్‌నగర్‌లోని విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం ఉంటుందని ఏఈ సంపత్ తెలిపారు. మరమ్మతుల కారణంగా సరఫరా నిలిపివేస్తున్నామని, వినయోగదారులు సహకరించాలని కోరారు.

ప్లాస్టిక్ వల్ల నష్టాలపై అవగాహన

కాశీబుగ్గ, జూలై 12: వరంగల్ దేశాయిపేటలోని సీకేఎం డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్ల ఆధ్వర్యంలో శుక్రవారం ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాల పై అవగాహన కల్పించారు. సీకేఎం ప్రభుత్వ కళాశాలలో పేపర్ బ్యాగుల వాడకంపై అవగాహన కల్పించారు. వైస్ ప్రిన్సిపాల్ ధర్మారెడ్డి, డాక్టర్ వరప్రసాద్, అనిల్, శ్రీనివాస్, సతీశ్‌కుమార్, స్రవంతి, హరిబాబు పాల్గొన్నారు.

సర్కారు బడిలో వనమహోత్సవం

వర్ధన్నపేట/చెన్నారావుపేట, జూలై 12: ఉప్పరపల్లి ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం వనమహోత్సవాన్ని సౌట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం, స్కౌట్ మాస్టర్ వీరస్వామి మాట్లాడుతూ పాఠశాల ఆవరణలో వేప, కానుగ, గుల్‌మార్, వివిధ రకాల పండ్ల మొక్కలు నాటామన్నారు. అలాగే, చెన్నారావుపేటలోని సిద్ధార్థ పాఠశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఫణికుమార్, డీటీ మధుసూదన్, సిద్ధార్థ విద్యాసంస్థల చైర్మన్ కంది గోపాల్‌రెడ్డి, హెచ్ఎం కరుణాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నల్లబెల్లి పీహెచ్‌సీలో మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ ప్రకాశ్

ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి

నల్లబెల్లి, జూలై 12: వర్షాకాలం ప్రారంభమైనందున ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో వి.ప్రకాశ్ అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, ఓపీని పరిశీలించారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తూ మలేరియా, డెంగీ, వాంతులు, విరేచనాలు తదితర సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వైద్య సిబ్బంది విధుల్లో అలసత్వం వీడాలన్నారు. ఆయన వెంట మండల వైద్యాధికారి ఆచార్య ఉన్నారు.

రైతులను మోసం చేసిన వ్యాపారి అరెస్టు

కాశీబుగ్గ, జూలై 12: వరంగల్ 14వ డివిజన్ బాలాజీనగర్‌లో రైతులు, అడ్డిదారులను మోసం చేసి పారిపోయిన వ్యాపారిని అరెస్టు చేసినట్లు ఎనుమాముల సీఐ పులి రమేశ్‌గౌడ్ తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. ఇమ్మడి మధుకర్ అనే వర్తక వ్యాపారి 12 ఏళ్ల నుంచి శ్రీకనకమహాలక్ష్మి ట్రేడర్స్ పేరుతో బాలాజీనగర్‌లో వ్యాపారం చేస్తున్నాడు. మార్కెట్‌కు వచ్చే మక్కలను అడ్డివ్యాపారులు, రైతుల నుంచి కొనుగోలు చేసేవాడు. అలాగే, ధాన్యం, నూకలను కొనుగోలు చేసి కమీషన్ ప్రాతిపదికన వ్యాపారం చేసేవాడు. ఈ క్రమంలో అడ్డివ్యాపారులు, రైతులను నమ్మించి సుమారు రూ. 3 కోట్లు మోసం చేసి పరారయ్యాడు. అడ్డివ్యాపారి జూలూరి కృష్ణమూర్తి ఎనుమాముల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు సీఐ వెల్లడించారు. శుక్రవారం మధుకర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. కేసును ఛేదించిన ఎస్సై పోగుల శ్రీకాంత్, నరసింహారావు, సిబ్బందిని అభినందించారు.

యువకుడికి కత్తిపోట్లు

సినిమా థియేటర్‌లో ఘటన

వర్ధన్నపేట, జూలై 12: ఇరువర్గాల మధ్య జరిగిన ఘటనతో యువకుడికి కత్తిపోట్లు దిగిన ఘటన వర్ధన్నపేట పట్టణంలోని సినిమా థియేటర్‌లో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మండలకేంద్రంలోని ఇనుప సామాను దుకాణంలో పని చేస్తున్న విజయ్(24)పై మరో వర్గానికి చెందిన పలువురు యువకులు శుక్రవారం సాయంత్రం సినిమా థియేటర్ వద్ద ఒక్కసారిగా దాడికి పాల్పడ్డారు. ఈ క్రమంలోనే కత్తితో విజయ్‌పై కడుపు, వీపుపై పొడిచాడు. అక్కడే ఉన్న యువకులు ఆపేందుకు ప్రయత్నించినా విజయ్‌కి బలమైన గాయాలయ్యాయి. తీవ్ర రక్త స్రావం కావడంతో వెంటనే సినిమా థియేటర్ నిర్వాహకులు పోలీసులకు సమాచారం ఇచ్చి యువకుడిని వరంగల్ ఆసుపత్రికి తరలించారు. దాడికి పాల్పడిన యువకులు ఇల్లందకు చెందిన వారుగా స్థానికులు చెబుతున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

జాన్‌పాకలో ఒకరి హత్య

గీసుగొండ, జూలై 12: వరంగల్ 16వ డివిజన్ జాన్‌పాక శివారులోని మాస్టర్ జీ పాఠశాల సమీపంలో గురువారం రాత్రి ఒకరు హత్యకు గురైనట్లు సీఐ బాబులాల్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు రాష్ట్రానికి చెందిన రవి(38) జాన్‌పాకకు చెందిన బాలగాని అనిల్ ఇంటి నిర్మాణం చేస్తున్నాడు. శుక్రవారం అనిల్ నిద్రలేచి ఇంటికి నీళ్లు పడుతున్న క్రమంలో ఇసుక కుప్పలో మృతదేహం కనిపించింది. వెంటనే వెళ్లి చూడగా అనిల్‌గా గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సీఐ బాబులాల్ తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకొని పరిశలించారు. తలకు బలమైన గాయం కావడంతో రవి అక్కడికక్కడే మృతి చెంది ఉంటాడని భావించారు. అనిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బీరన్నస్వామి బోనాలకు ఏర్పాట్లు

కరీమాబాద్, జూలై 12: బీరన్నస్వామి బోనాలకు ఏర్పాట్లు చేస్తున్నామని కరీమాబాద్ బీరన్నస్వామి దేవస్థాన కమిటీ అధ్యక్షుడు కోరె సదానందం తెలిపారు. శుక్రవారం కరీమాబాద్ బీరన్నకుంటలో బీరన్న బోనాల ఏర్పాట్లపై కురుమ కులస్తులు, కమిటీ సభ్యులు సమావేశం నిర్వహించారు. ఈ నెల 17న బీరన్న బోనాలు నిర్వహించనున్నట్లు సదానందం తెలిపారు. సమావేశంలో కార్పొరేటర్ మరుపల్ల రవి, మాజీ కార్పొరేటర్ పల్లం రవి, ప్రధాన కార్యదర్శి కోరె నాగరాజు, కోశాధికారి నరిగె లక్ష్మణ్, కుల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

మొక్క నాటి నీళ్లు పోస్తున్న హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య

మొక్కలతోనే మానవ మనుగడ

హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్‌చౌరస్తా, జూలై 12: నిత్య జీవితంలో మానవుడు ప్రతి విషయానికి మొక్కలపైనే ఆధారపడి జీవిస్తున్నాడని, మానవ మనుగడకు మొక్కలే మూలాధారమని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. కాకతీయ మెడికల్ కళాశాల ఆవరణలో శుక్రవారం ట్రైబ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన 75వ వన మహోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు, వైద్య విద్యార్థులతో కలిసి మొక్కలు నాటి, వాటిని సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రానున్న తరాలకు కాలుష్య రహిత సమాజాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాళోజీ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ సంధ్యారాణి, కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ దివ్వెల మోహన్‌దాస్, కేఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాంకుమార్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సురేందర్, విశ్రాంత డీఎఫ్‌వో పురుషోత్తం, కేఎంసీ జూడాల సంఘం అధ్యక్షుడు డాక్టర్ అజయ్‌కుమార్, ఐఎంఏ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి అశ్విని, నవదీప్, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఘనంగా సుధీర్‌రెడ్డి బర్త్‌డే వేడుకలు

రాయపర్తి, జూలై 12: బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బిల్లా సుధీర్‌రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంతోపాటు రాజీవ్ చౌరస్తాలో పార్టీ శ్రేణులు, అభిమానులు కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు గారె నర్సయ్య, పూస మధు, ఉబ్బని సింహాద్రి, చిలువేరు సాయిగౌడ్, గారె కుమారస్వామి, మహ్మద్ మన్నన్, బషీర్, సలీం, అశ్రఫ్ పాషా, పోగుల కొండ వేణు, ఎల్లస్వామి, వీరన్న, ఉబ్బని కిశోర్‌కుమార్, దాసరి శ్రీనివాస్, అయిత రవి, నరేశ్, కృష్ణకాంత్ పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తులు

కరీమాబాద్, జూలై 12: కేంద్ర కార్మిక శాఖ ఆధ్వర్యంలో నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ ద్వారా ఏటా 1వ తరగతి నుంచి పీజీ కోర్సులు అభ్యసించే బీడీ కార్మికుల పిల్లలకు ఉపకార వేతనాలు అందిస్తున్నది. ఇందులో భాగంగా 2024-25 విద్యా సంవత్సరానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కేంద్ర కార్మిక శాఖ ప్రకటన జారీ చేసినట్లు బీడీ కార్మిక సంక్షేమ ఆసుపత్రి వరంగల్ మెడికల్ ఆఫీసర్ సురేశ్‌కుమార్ తెలిపారు. ప్రీ మెట్రిక్ కేటగిరీలో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులు ఆగస్టు 31లోగా, పోస్ట్ మెట్రిక్ కేటగిరీలో 11వ తరగతి, ఆపై కోర్సులు అభ్యసించే విద్యార్థులు అక్టోబర్ 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు WWW.SCHOLARSHIPS.GOV.IN లేదా హెల్ప్‌లైన్ నంబర్ 0120-6619540లో సంప్రదించాలని సూచించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కరీమాబాద్/ఖిలావరంగల్, జూలై 12: ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కార్పొరేటర్ పల్లం పద్మ అన్నారు. వరంగల్ మహానగరపాలక సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా 32వ డివిజన్‌లోని నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టారు. నీటి గుంతల్లో ఆయిల్ బాల్స్ వేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పల్లం రవి, సిబ్బంది పాల్గొన్నారు. వరంగల్ 37వ డివిజన్‌లోని గిరిప్రసాద్‌నగర్‌లో కార్పొరేటర్ వేల్పుగొండ సువర్ణ, బయిలాజిస్ట్ మాధవరెడ్డి పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. నీటి గుంతల్లో ఆయిల్‌బాల్స్ వేశారు. బీఆర్ఎస్‌కేవీ జిల్లా అధ్యక్షుడు బో